పీఎస్ఆర్ క్రికెట్ టోర్నీ విజేతలకు
బహుమతుల ప్రదానం

వివరాలు 04లో..

కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )

హైదరాబాద్
సోమవారం
26-02-2024
వెల రూ.4/-
సంపుటి: 01 సంచిక: 15
పేజీలు: 04
Editor: Vanam Nagaiah



### నాడు సేంద్రియ సాగు సారథి..

# నేడు ప్రజలకు వారధి తాండ్ర వినోద్‌రావు

- హరితలోకం ఆయన స్వప్నం..
- సేంద్రియ సాగును కొత్త పుంతలు తొక్కించిన ఆధునిక అన్నదాత
- క్షామం, దుర్భిక్ష జాడ్యం లేని సమాజమే ఆయన ఆశయం
- పల్లెలన్నీ పచ్చలహారంలా మెరవాలన్న స్వాప్నికుడు
- ఉమ్మడి జిల్లా వ్యవసాయం, పరిశ్రమలతో పరిఢవిల్లాలని తపన
- యువతలో నైపుణ్యం పెంచేలా ప్రణాళికలు
- కుగ్రామం నుండి అగ్రరాజ్యం వరకూ సాగిన తాండ్ర ప్రస్థానం..

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

క్షామం, దుర్భిక్ష జాడ్యంలేని హరితలోకం నిన్నటి ఆయన స్వప్నం.. నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లా సబ్బండ వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా వ్యవసాయం, పరిశ్రమలతో ఈ ప్రాంతం పరిఢవిల్లాలన్నదే నేడు ఆయన ముందున్న ఏకైక లక్ష్యం. అందులో మొదటి స్వప్నం ఇసుక నేల ల్లోనూ పసిడి పంటలు పండుతాయన్న మిగతా 2లో..



### 27న మరో రెండు గ్యారంటీల అమలుకు

# ప్రకటన

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



- మార్చిలో 200 యూనిట్లు లోపు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు
- డ్వాక్రా సంఘాలకు త్వరలో వడ్డీ లేని రుణాలు..

కొత్తగూడెం, కెరటం న్యూస్ ప్రతినిధి

**ఈనెల 27న చేవెళ్లలో** భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి మరో రెండు గ్యారెంటీ పథకాల అమలును లాంఛనంగా ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రామవరం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఏర్పాటు చేసిన 10.5 మెగావట్ల సోలార్ పవర్ ప్లాంట్ ను డిప్యూటీ సీఎం ప్రారంభించి స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు విద్యుత్తు వినియోగించే వారు ఎటువంటి బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మార్చి నెల నుంచి వారు కరెంటు బిల్లు కట్టాల్సిన అవసరం లేదన్నారు. టిఆర్ఎస్ సర్కారు చేసిన అప్పులు వారు పెట్టే బాధలు మాకు అడ్డంకులు కాబోవు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొనసాగిన ఇందిరా క్రాంతి పదం మహిళా సంక్షేమ పథకాన్ని పునః ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించేందుకు త్వరలో ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుంది అన్నారు. రేపు సాయంత్రం హైదరాబాదులో 43,000 మంది సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ఇన్సూరెన్స్ పథకాన్ని మిగతా 2లో..



### అన్నదాతలపై కాల్పులు

# అమానుషం

- కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి
- సీఎంగా మోడీ మాటలు.. పీఎంగా ఆచరించట్లే
- స్వామినాథన్ సిఫారసుల అమలుతోనే భారతరత్నకు సార్ధకత
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని
- ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సదస్సు..

కెరటం న్యూస్, ఖమ్మం, ఫిబ్రవరి 25:

**పంటలకు కనీస మద్దతు ధర** (ఎంఎస్పీ) కల్పించాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న అన్నదాతలపై మోడీ ప్రభుత్వం కాల్పులు అమానుషమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మరియు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఎంఎస్పీపై మిగతా 2లో..

### ఛత్తీస్‌గఢ్ సీఎం, కాకతీయ మహరాజ్‌లకు

# బీజేపీ నేత తాండ్ర ఘన స్వాగతం..





భద్రాచలం ప్రతినిధి, కెరటం న్యూస్

**దక్షిణ అయోధ్య భద్రాచలం** నుంచి భద్రకాళి–కాకతీయ క్లస్టర్ రథయాత్ర ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి ని, విశిష్ట అతిథి కాకతీయ వారసుడు మహారాజ కమల్ చంద్ర భంజ్ దేవ్ కాకతీయకు బీజేపీ రాష్ట్ర నాయకులు వినోద్ రావు తాండ్ర ఆదివారం ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రిని, తన ఆప్త మిత్రుడైన కాకతీయ మహారాజ్ ను వినోద్ రావు తాండ్ర ఐటిసి అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. వారికి పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సత్కరించారు. అనంతరం వారిద్దరితో మిగతా 2లో..



### అంబరాన్నంటిన

# టిజీఓస్ సంబురం

- టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావుకు ఘన స్వాగతం
- యావత్ తెలంగాణ ఉద్యోగులను ఐక్యం చేద్దాం: ఏలూరి

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

**తెలంగాణ గెజిటెడ్ అదికారుల** సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన టిజిఓస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు సన్మాన కార్యక్రమం పండుగ వాతావరణం లో అంబరం తాకింది. వందలాదిగా గెజిటెడ్ అధికారులు భారీ ర్యాలీగా రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావుకు ఎదురేగి బాణాసంచా పూల జల్లులతో ఘన స్వాగతం పలికారు. టీజీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక సన్మాన కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఘనంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఇటీవలే టీజీవో రాష్ట్ర అధ్యక్షులు గా ఎన్నికైన ఏలూరు శ్రీనివాసరావు ఖమ్మం టీజీవో మిగతా 2లో..



# 27న మరో రెండు గ్యారంటీల అమలుకు ప్రకటన

(మొదటి పేజీ తరువాయి..)

ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. సింగరేణిలో ప్రారంభించిన సోలార్ పవర్ ప్రాజెక్టు రాష్ట్రానికే కాదు దేశానికే దేశానిర్దేశం చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టును సఫలీకృతం చేసిన సింగరేణి అధికార యంత్రాంగాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు తెలిపారు. సింగరేణి అంటే ఉమ్మడి ఖమ్మం జిల్లా, గోదావరి పరివాహక ప్రాంతం, ఉద్యోగాల గనిగా పిలుచుకునే వాళ్ళం. లక్ష అయిదు వేల పైగా ఉద్యోగాలతో జీవన భృతి, రాష్ట్రానికి ఆదాయం ఇవ్వడమే కాదు కరెంటు ఉత్పత్తికి అవసరమైన బొగ్గును ఇస్తుందన్నారు. చదువుకున్న వారికి చదువు రాని వారికి ఉద్యోగాలు కల్పించడంలో సింగరేణి తెలంగాణకు తల మానికంగా నిలుస్తుంది అన్నారు. పెద్ద ఎత్తున ఆదాయం సాధిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు యజమానులకు ఆయన అభినందనలు తెలిపారు. సింగరేణిలో సృష్టించే సంపదను రాష్ట్ర ప్రజలు , స్థానిక కార్మికులకు పంచుతామన్నారు. గత పది ఏళ్లలో టిఆర్ఎస్ సర్కార్ మాటలు చెప్పడం తప్ప సింగరేణికి చేసింది ఏమీ లేదు ఫలితంగానే ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిందని విమర్శించారు. మనకి సంక్షేమ రాజ్యం అని రాజ్యాంగం ప్రకటించింది. రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకు ఉద్యోగం కల్పించి జీవన పరిస్థితులను మెరుగుపరిచే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఆ మేరకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ద్వారా నలుగురు కార్మికులు చేయాల్సిన పనిని, ఒక కార్మికునీ తో చేయిస్తూ శ్రమదోపిడికి పాల్పడుతున్నారన్న అంశాన్ని తాను సంపూర్ణంగా అంగీకరిస్తున్నట్టు ప్రకటించారు. ప్రజల శ్రమ దోపిడీని ఉపేక్షించబోమ్, కనీస వేతన చట్టం అమలు చేయాలని గత పది సంవత్సరాలుగా సీఎల్పీ నేతగా ప్రతి సభలో ప్రశ్నించానని గుర్తు చేశారు. కనీస వేతనాలు ఇవ్వడం లేదు చర్యలు తీసుకోండని చెప్పిన టిఆర్ఎస్ సర్కారు వినకుండా కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే కార్మిక శాఖ ద్వారా ఇప్పటికే సంక్షేమ కార్యక్రమాలు మొదలుపెట్టామన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు సీఎల్పీ నేతగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ సమయంలో బొగ్గు బాబులన్నీ తిరిగిన సందర్భాన్ని తెలుసుకున్న అనుభవాలను వివరించారు. అవి ప్రతి సందర్భంలో తనకు దిక్సూచిగా పనిచేస్తాయన్నారు. ఇందారం ఓపెన్ కాస్ట్ లో ఓ వాచ్ మెన్ జీతం ఎంత అని ప్రశ్నించగా 46,000 అని చెప్పాడు. కొద్ది దూరం వెళ్లి మరో వాచ్మెన్ జీతం గురించి ప్రశ్నించగా 11500 అని వివరించారు. ఒకే ఉద్యోగం వేతనంలో ఎంతో వ్యత్యాసం ఏంటని ఆరా తీస్తే మధ్య దళారుల దోపిడీ. స్థానికులకే 80 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే సర్కులర్ జారీ చేసిన విషయాన్ని స్పష్టం చేశారు. ఇటీవల సింగరేణిలో 440 మందికి నేరుగా ఉద్యోగ నియామక పత్రాలు అందించాం మరో 489 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశాం, కారుణ్య నియామకాల వయసు 35 నుంచి 40 ఏళ్లకు పెంచిన విషయాన్ని భట్టి విక్రమార్క వివరించారు. కూల్ మైండ్స్ వేలంలో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనకపోవడం వల్ల గనులు కోల్పోతున్నామని కార్మిక సంఘాలు మా దృష్టికి తీసుకొస్తే నాడు ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోని బొగ్గు గనులన్నీ సింగరేణికే చెందేలా కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి బొగ్గు దిగుమతి ద్వారా సరఫరా మూలంగా సింగరేణి ఆర్థికంగా నష్టపోయి సంపదను ఉద్యోగాలను కోల్పోయింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఖర్చు పెరిగి బిల్లుల భారం పెరిగిందన్నారు. బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని నిర్ణయించాం. ఏడాది 67 మిలియన్ టన్నుల నుంచి 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నాం. రాబోయే ఐదేళ్లలో 90 నుంచి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తాం. నైని, తాడిచర్ల, కోయగూడెం, రాంపురం బొగ్గు గనులు ఏర్పాటు చేస్తాం దేనిని వదులుకోమన్నారు. వారికి స్పష్టంగా చెబుతున్నాం 6 గ్యారంటీల్లో ఇప్పటికే రెండు పూర్తి చేశాం. ఆర్టీసీ ఉంటుందా పోతుందా అనేవారికి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 17.50 కోట్ల జీరో టికెట్లు జారీ చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జీరో టికెట్ల మొత్తాన్ని చెల్లించి ఆర్టీసీకి భారీగా ఆదాయాన్ని సమకూర్చాము. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూపు పది లక్షలకు పెంచామన్నారు.

### నాడు సేంద్రియ సాగు సారథి.. నేడు ప్రజలకు వారధి..

# తాండ్ర వినోద్‌రావు..











(మొదటి పేజీ తరువాయి..)

ఆశయం సంపూర్ణంగా నెరవేరింది. అందుకుగాను మెదక్ ప్రాంతంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ సాగుకు కొత్త నడకలు నేర్పి, ఆధునిక అన్నదాతగా, కేవీకే చైర్మన్‌గా అందరి నోటా ఘనకీర్తిని పొందారు. వ్యవసాయంలో మెళకువలను కర్షకులకు నేర్పి ఎందరినో ఉత్తమ రైతులుగా తీర్చి దిద్దిన ఆయన ఇన తనసొంత జిల్లాపై మమకారంతో తను పురుటిగడ్డవైపు అడుగులు వేశారు. తాను కాలు మోపిన ప్రతీ చోటా పచ్చదనంతో తులతూగిన పంటలను, తన ప్రాంతమైన ఖమ్మం జిల్లాలోనూ అదే తరహా ప్రత్యేకమైన వ్యవసాయాన్ని చేపట్టి ఈ ప్రాంత రైతులను వ్యవసాయం వైపు, యువతను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలన్న మంచి ఆశయంతో నడుంబిగించారు. ఇంతకూ ఆయన ఎవరు అనేగా మీ సందేహం.. ఆయనే ప్రముఖ పారిశ్రామిక వేత్త, డాక్టర్ రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం మాజీ చైర్మన్, భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామస్తులు తాండ్ర వినోద్ రావు.

**కుగ్రామం నుండి అగ్రరాజ్యం వరకూ సాగిన ప్రస్థానం..**

తాండ్ర వినోద్ రావు ప్రస్థానాన్ని ఒక సారి పరిశీలిస్తే విస్తుగొలిపే అంశాలు వెలుగు చూస్తాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వారే. వినోద్ రావు తాండ్ర ప్రజాసేవకు, ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలకు అంకితమైన కుటుంబం నుంచి వచ్చారు. రాముడి సేవకు, హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడిన వంశం వారిది. వీరి స్వగ్రామం కొత్తగూడెం - భద్రాద్రి జిల్లా ముల్కలపల్లి మండలం తిమ్మంపేట. 1930లలో వినోద్ రావు తాత గారు సుదర్శన్ రావు భద్రాచలం రాములవారి ఆలయానికి ట్రస్టీ గా ఉండేవారు. ఆ హోదాలో ముత్యాల తలంబ్రాలు సమర్పించే వారు. వారు ఆ రోజుల్లోనే మున్షీ వరకు చదివారు. వినోద్ రావు గారి తండ్రి కృష్ణారావు గారు వకీల్ రావు గారి గా పాల్వంచ ప్రాంతంలోనే కాకుండా జిల్లాలో పేరు పొందారు. వీరి పెదనాన్న గారు టీ వీ నరసింహా రావు గారు జడ్జి గా పనిచేశారు. వినోద్ రావు ఇంటర్ వరకూ పాల్వంచలో చదువుకున్నారు. డబుల్ పోస్ట్ గ్రాడ్యుయేట్. అమెరికా లో మంచి ఉద్యోగం చేసినా, స్థిరపడడానికి మంచి అవకాశం ఉన్నా మాతృ భూమి మీద ప్రేమతో, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో తిరిగి వచ్చారు. ఒక సాధారణ గ్రామం నుండి మొదల్కైన ప్రస్థానం అగ్రరాజ్యంలోనూ తన కీర్తి ప్రతిష్టలు సంపాదించారు. వినోద్‌రావుకు సతీమణి, ఇద్దరు పిల్లలున్నారు.

**పల్లెలంటే పంచ ప్రాణాలు..**

గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థ బాగుంటేనే దేశం కూడా బాగుంటుందని ప్రగాఢంగా విశ్వసించే తాండ్ర ప్రజలు పస్తులుండే దుస్థితి పోవాలని నిత్యం తపిస్తుంటారు. అందుకే ఆధునిక కర్షకునిగా డాక్టర్ రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ గా కొన్నాళ్ల పాటు పనిచేసి అనేక మంది వ్యవసాయ శాస్త్రవేత్తలను రప్పించి సాంప్రదాయ సాగు స్థానంలో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. అందుకే ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేస్తూ ప్రణాళిక బద్ధంగా సాగును సరికొత్త పుంతలు తొక్కించి ఔరా అనిపించారు. దీంతో పాటు వినోద్ రావు గత దశాబ్దానికి పైగా సోషల్ వర్కర్ గా పలు స్వచ్ఛంద సంస్థ లలో ఉన్నత బాధ్యతలు సమర్థంగా నిర్వహించి పేదలకు సేవ చేశారు. ఆయన రియల్ ఎస్టేట్ రంగంలో ఉంటూనే 2015 నుంచి 2021 వరకూ ఏకలవ్య ఫౌండేషన్ తరఫున విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయం వంటి రంగాల్లో సేవలందించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రామాల్లో వారి నాయకత్వంలోని ఫౌండేషన్ అద్భుతమైన సేవ చేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా లో గిరిజనుల అభ్యున్నతి కోసం చేసిన కృషి పలువురి ప్రసంశలు అందుకుంది. ప్రత్యేక విద్యా కార్యక్రమం ద్వారా రెండు రాష్ట్రాల్లో 24 జిల్లాల్లో బడుగు, బలహీన, నిరుపేద కుటుంబాలకు సేవ చేస్తున్నారు. డాక్టర్ రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ గా 2017 నుంచి జనవరి 2024 ఆయన అందించిన అద్భుత సేవలు ప్రశంసలు అందుకున్నాయి. ముప్పేట దాడికి గురవుతున్న హిందూ సమాజ సేవకు వీరు నడుం బిగించారు. నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో భారత్ అభివృద్ధి పథంలో దూసుకు పోవడంతో స్ఫూర్తి పొంది, ఈ మహా క్రతువులో తన వంతు పాత్ర పోషించేందుకు, ప్రత్యక్ష రాజకీయాల ద్వారా ప్రజా సేవ కొనసాగించేందుకు ఉత్సుకతతో ఉన్నారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంట్రపెన్యూర్ హబ్‌గా పరిఢవిల్లాలి..: వినోద్‌రావు తాండ్ర (బీజేపీ నేత, ఉమ్మడి ఖమ్మం జిల్లా)**

గ్రామీణ ప్రాంతాలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు.. ఇలాంటి పల్లెలు అభివృద్ధి చెందకుండా దేశాభివృద్ధిని ఊహించుకోలేమని బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు స్పష్టం చేశారు. అందుకే తన సొంత జిల్లా ప్రజలకు సేవ చేయాలన్న మంచి ఆశయంతో తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల హబ్( ఎంట్రపెన్యూర్ హబ్‌గా) తీర్చి దిద్దాలన్నదే తన ఆశయమని అన్నారు. అందుకోసం ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాలను రెండు కండ్లుగా భావించి రెండు ప్రాంతాల అభివృద్ధికి తాను కృషిచేస్తానని అన్నారు. యువతే దేశానికి వెన్నెముక అలాంటి యువతకు ఉద్యోగాలివ్వడం మాత్రమే కాదనీ, వారే ఉద్యోగాలిచ్చేలా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నది తన కల అన్నారు. ప్రధానంగా ఏజెన్సీలోని గిరిజన యువతకు ప్రోత్సాహం అందించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇప్పించి వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి వివిధ పరిశ్రమలపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. తద్వారా యువతో దాగున్న మేధాశక్తిని బయటకు తీసి ఖమ్మం, భద్రాద్రిజిల్లాలోని యువతకు సరికొత్త ఉపాధి మార్గాన్ని తయారు చేయాలన్నది తన ముందున్న లక్ష్యమని అన్నారు. ఉమ్మడి జిల్లాలో వందలాదిగా మూత పడిన ఇంజనీరింగ్ కాలేజీలకు కారణాలు అనేకం ఉన్నా, ప్రధానంగా నైపుణ్యత సాధించడంలో వెనుకబాటు తనం ఉందన్నారు. అందుకే తాను బీజేపీ ప్రతినిధిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలను అభివృద్ధి వైపు నడిపించేందుకు తన శాయశక్తులా కృషిచేస్తానని అన్నారు.

### ఛత్తీస్‌ఘడ్ సీఎం, కాకతీయ మహారాజ్‌లకు

# బీజేపీ నేత తాండ్ర ఘన స్వాగతం





(మొదటి పేజీ తరువాయి..)

కలిసి భద్రాచల సీతారామ చంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారిద్దరూ భక్తి శ్రద్ధలతో లక్ష్మణ సహిత సీతా రామచంద్ర మూర్తిని దర్శించుకున్నారు. వారిని ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. కొత్త మార్కెట్ మైదానంలో అనంతరం భారతీయ జనతా పార్టీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రకాళి - కాకతీయ క్లస్టర్ రథయాత్ర పారంభ కార్యక్రమం, భారీ బహిరంగ సభలో వారు పాల్గొన్నారు. మరోసారి మోడీ సర్కార్ రాబోతోందని ముఖ్యమంత్రి అన్నారు. మోడీ గారి పాలనలో గిరిజనులకు ఎంతో మేలు జరిగిందని, ఖమ్మం అభివృద్ధి వేగంగా జరగాలంటే బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట రమణారెడ్డి, శాసనసభ్యులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ శాసన సభ్యులు మార్తినేని ధర్మారావు , కొండేటి శ్రీధర్, గుండె విజయరామరావు, పార్లమెంట్ ఎన్నికల ప్రభారీ శ్రీకాంత్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి , కొత్తగూడెం జిల్లా అధ్యకుడు రంగా కిరణ్ పాల్గొన్నారు.

**మహిళా త్రిశూల్ దీక్ష కార్యక్రమంలో పాల్గొన్న తాండ్ర వినీల..**

ఖమ్మంలోని సీక్వెల్ రిసార్ట్ లో విశ్వ హిందూ పరిషత్ ఆద్వర్యంలోనిర్వహించిన త్రిశూల్ దీక్ష కార్యక్రమానికి వినోద్ రావు తాండ్ర సతీమణి వినీల రావు హాజరయ్యారు. ఖమ్మం పరిసర ప్రాంతాల్లోని దాదాపు వేయి మందికి పైగా మహిళలు హాజరు కావడం తో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. హిందూ ధర్మంపై శ్రద్ద వున్న మహిళలు (16 నుండి 40 వయస్సు) ఈ దీక్షను స్వీకరించారు. దీక్షాకార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికి తాండ్ర వినీల రావు అభినందనలు తెలియజేశారు.

### అంబరాన్నంటిన

# టిజీఓస్ సంబురం









(మొదటి పేజీ తరువాయి..)

కార్యాలయానికి విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా గెజిటెడ్ అధికారులు, టీఎన్జీవో నాయకులు బాణసంచా కాల్చి పెద్ద ఊరేగింపుగా ఏలూరు ఇంటి నుంచి టీజీవో కార్యాలయం వరకు తోడుకొని వచ్చారు. తదుపరి భారీ సమావేశాన్ని టీజీవో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి వేలాద్రి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏలూరి మాట్లాడుతూ తప్పకుండా యావత్ తెలంగాణ ఉద్యోగుల ఆకాంక్షలను, ఆశలను, నెరవేర్చే విధంగా టీజీవో రాష్ట్ర సంఘం తరఫున తను పని చేస్తానని, ఎక్కడ రాజీ పడనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ శేషు ప్రసాద్, టీఎన్జీవో నాయకులు కొణిదెల శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాస్, డ్రైవర్ల సంఘం ప్రతినిధులు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా టీజీవో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జి రమేష్, వాసిరెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నయుంపాషా, కనపర్తి వెంకటేశ్వర్లు, ఎన్వి కృష్ణారావు, ఉషాశ్రీ, సుధారాణి, సంజయ్, హరీష్, వివిధ శాఖల నుండి 200 మంది గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

### అన్నదాతలపై కాల్పులు

# అమానుషం

(మొదటి పేజీ తరువాయి..)

ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన నాడు గుజరాత్ సీఎం నరేంద్ర మోడీ నేడు ప్రధానమంత్రిగా ఆ కమిటీ సూచనలను ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు. స్వామినాథన్ సిఫారసుల అమలుతోనే ఆయనకిచ్చిన భారతరత్నకు సార్థకత చేకూరుతుందని స్వయంగా ఆయన కుమార్తె మధుర వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మంచికంటి మీటింగ్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సులో పోతినేని మాట్లాడారు. ధాన్యాలు, పప్పులు, నూనె గింజలు, వాణిజ్య తదితర 23 రకాల పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా మోడీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. నీతి ఆయోగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండా ఆయన మరణానంతరం భారతరత్న ఇవ్వడం అవార్డుకు సార్థకత చేకూరినట్లు కాదని పేర్కొన్నారు. వాస్తవ ధరకు కౌలు, పెట్టుబడి, శ్రమ, ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మొత్తం ఖర్చుపై 50 శాతం అదనంగా ఎంఎస్పీ నిర్ధారించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలనే ఆరు డిమాండ్ల సాధన కోసం రైతులు ఢిల్లీలో ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. భూసేకరణ చట్టం- 2013 ను సైతం మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ విలువైన పంట భూములను కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. పెసా, 1/70 చట్టాలను కూడా తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. ఢిల్లీలో రైతుల ఆందోళనలకు మద్దతుగా నిర్వహించే ఉద్యమాలకు సంఘీభావం తెలపాల్సిందిగా కోరారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, వై.విక్రం, తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యుడికి ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని
# చాటుకున్న అమెరికా డాక్టర్ వెంకట్

- **బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం**

**(కెరటం న్యూస్ ఫిబ్రవరి 25 దుమ్ముగూడెం)**
దుమ్ముగూడెం మండలంలోని రామారావు పేట గ్రామం అతి నిరు పేద కుటుంబానికి చెందిన వెన్నెముక సంబంధిత వ్యాధితో బాధప డుతున్న పోడియం రాంబాబు కి అమెరికాలో వైద్య వత్తిలో స్తిర పడ్డ ప్రవాస ఆంధ్రుడు డాక్టర్ వెంకట్ వైద్య ఖర్చులకు ఆర్థిక సహా యం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు పోడియం రాంబాబు వెన్నె ముక సంబంధిత వ్యాధితో వైద్యం చేయించుకునే స్తోమతల లేక బాధపడుతుండగా ఆపదలో ఉన్న నిరుపేదలకు అపన్న హస్తం అందించే బ్యూటి ఫుల్ లైఫ్ అసోసియేషన్ నిర్వాహకులు 4 రోజుల క్రితం బిఎల్ఏ ప్రోత్సాహకులు విజయవాడకు చెందిన డెర్మోకేర్ ఆసుపత్రి యాజమాన్య దంపతులు రాజీవ్,డాక్టర్ ప్రవీణ డాక్టర్ పృథ్వి బిఎల్ఏ సభ్యులందరి సహకారంతో 22,000/-రూ ఆర్థిక సాయం అందించారు. రాంబాబు కి మెరుగైన వైద్యానికి రూ 4.5 లక్షలు అవసరం కాగా బిఎల్ఏ నిర్వాహకులు దాతల నుండి విరాళాలు సేకరించడం కోసం వీడియో రూపంలో సోషల్ మీడియాలో ప్రసారం చేసారు. ఈ వీడియోని అమెరికాలో నివాసం ఉన్న డాక్టర్ ప్రవీణ మిత్రుడు డాక్టర్ వెంకట్ చూసి మానవత్వంతో చలించి ఆయన వంతు తక్షణ సాయంగా 10,000/-రూ నగదును బిఎల్ఏ నిర్వాహకులకు విరాళంగా పంపి రాంబాబుకి అందించమన్నారు. అట్టి సాయాన్ని ఆదివారం గ్రామస్తుల సమక్షంలో బాధితుడు రాం బాబుకి అందించారు. ఈ సందర్భంగా బిఎల్ఏ గౌరవ సభ్యులు మాట్లాడుతూ. దాతలు మానవత్వంతో స్పందించి తమకు తోచి నంత ఆర్థిక సాయం అందించాలని .(ఫోన్ పే, గూగుల్ పే నంబర్ బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ 9390918358)



కోరారు బిఎల్ ఏకి సహకరిస్తున్న డాక్టర్ వెంకట్ కి, డాక్టర్ ప్రవీణ కి, దాత లందరికీ హృద యపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్య క్రమంలో బిఎల్ఏ గౌరవ సభ్యులు వర్మా విష్ణు,నరేష్, గ్రామస్తులు పోడియం వెంకటేశ్వర్లు,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ వ్యవస్థను
# కాపాడుకుందాం..



- **బీజేపీ నాయకులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు**

**(ఖమ్మం రూరల్, కెరటం న్యూస్)**
సనాతనంగా విలువలతో కూడిన కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం అని అందుకు అందరం కలిసి ఐక్యతగా పని చేద్దామని ప్రముఖ వైద్యులు బిజెపి జిల్లా నాయకులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.ఖమ్మం జిల్లా సామాజిక సమరసత ఆధ్వర్యంలో తీర్థాల సంగమేశ్వర స్వామి (కూడలి)లో నిర్వహించిన కుటుంబ సమ్మేళన కార్యక్రమానికి డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. జీవీ మాట్లాడుతూ భారత దేశంలో పాశ్చాత్య దేశాల ప్రభావం పడకుండా ఉమ్మడి కుటుంబ వ్యవస్థను పటిష్టంగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు. రామ రాజ్య స్థాపన లక్ష్యంగా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని, లోక్ సభలో 370 సీట్ల గెలుపే లక్ష్యంగా ప్రజలు ఓట్లు వేయాలని అక్కడి వారిని కోరారు..

# అంకిత భావానికి దక్కిన గౌరవం



- **ఐజేయు నేత రాంనారాయణ**
- **మీడియా అకాడమీ ఏర్పాటుపై ప్రెస్ క్లబ్లో అభినందన కార్యక్రమం**

**(ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ ప్రతినిధి)**
మీడియా అకాడమీ ఛైర్మన్ పదవి కె.శ్రీనివాసరెడ్డి కి ఇవ్వడం ఐదు దశాబ్దాలుగా జర్న లిస్టుల సంక్షేమం, అభివృద్ధి, వృత్తి నైపుణ్యానికి కృషి చేస్తున్న ఆయన అంకిత భావానికి దక్కిన గౌరవమని టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ తెలిపారు. మీడియా అకాడమీ పూర్వపు ఆంధ్రప్రదేశ్ తొలి అధ్యక్షునిగా శ్రీనివాసరెడ్డి పని చేశారని మరోసారి ఆయనకు గౌరవం దక్కడం పట్ల యావత్ జర్నలిస్టు సమాజం హర్షం వెలిబుచ్చుతుందని ఆయన అన్నారు. ఐజేయు జాతీయ అధ్యక్షులు, ప్రజాపక్షం సంపాదకులు కలివికోలను శ్రీనివాసరెడ్డిని మీడియా అకాడమీ చైర్మన్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం పట్ల ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో టియుడబ్ల్యుజె (ఐజయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. టియుడబ్ల్యు జేఐజేయు జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షత న జరిగిన సభ లో రాంనారాయణ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఉద్యమంలో పనిచేసిన శ్రీనివాసరెడ్డికి జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేకమైన అవగాహన ఉన్నదని ప్రభుత్వానికి, జర్నలిస్టులకు మధ్య వారధిగా పనిచేస్తూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు, రాష్ట్ర సమాచార ప్రచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రాంనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మంజిల్లా జర్నలిస్టు సమాజం శ్రీనివాసరెడ్డికి ప్రతి సందర్భంలోను అండగా నిలిచిందని ఈ సందర్భంగా రాంనారాయణ గుర్తు చేశారు. హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, నైపుణ్య శిక్షణ తదితర విషయాలలో ఈ ప్రభుత్వం మరింత చేరువ కావాలని అందుకు ప్రెస్ అకాడమీ దోహదపడాలని రాంనారాయణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజేయు) జిల్లా కార్యదర్శి ఎనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు ఎన్. వెంకట్రావు. ఖదీర్, నలజాల వెంకట్రావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, జిల్లా కోశాధికారి నాగండ్ల శివానంద, నగర కార్యదర్శి చెడుకుపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు వై. మాధవరావు, మోహినుద్దీన్, నామ పురుషోత్తం, మేడి రమేష్, కళ్యాణ్, కె. వెంకటేశ్వర్లు, గణేష్, సుధాకర్, సత్యనారాయణ, మధులత, ఎపిఆర్వో వాల్లోజు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాద్ జిల్లా బిజెపి మహిళా మోర్చా
# అధ్యక్షురాలుగా గుండెబోయిన నాగమణి



**(కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి)**
మహబూబాబాద్ జిల్లా బిజెపి మహిళ మోర్చ అధ్యక్షురాలిగా గార్ల మండలం సీతంపేట ఎంపీటీసీ శ్రీమతి గుండెబోయిన నాగమణి గారిని నియామిస్తు మహబూబాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీ యలమంచలి వెంకటేశ్వరరావు గారు నియమాక పత్రాన్ని ఈరోజు అందజేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ మురళి , మరియు గార్ల మండల అధ్యక్షులు జశ్వంత్ ఠాగూర్ శ్రీను,వీర్యా తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య శ్రీ విద్యాసాగర్
# జి.మహారాజ్‌కీ జైనుల ఘన నివాళి



**కెరటం న్యూస్, గార్ల ప్రతినిధి**
ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహారాజ్ 18 ఫిబ్రవరి 2024న సల్లేఖానా పద్ధతిలో సమాధి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని డోంగర్‌ఘర్‌లో ఉన్న 'చంద్రగిరి తీర్థం' వద్ద 'సల్లేఖన' నిర్వహించి తన దేహాన్ని విడిచిపెట్టారూ. ఆచార్య జీ మృతితో జైన సమాజం మొత్తం శోక సంద్రంలో మునిగిపోయింది. ఈ సందర్భంగా ఆదివారం భారతదేశ వ్యాప్తంగా నివసిస్తున్న జైన సమాజం మతస్థులు అంతా కలిసి ఆచార్య విద్యాసాగర్ మహరాజ్‌కు నివాళి అర్పించారు. అదే విధంగా గార్ల జైన మత సభ్యులు అందరూ గార్ల వీధుల గుండా నినాదాలు తీస్తూ భారీ ర్యాలీగా మండల కేంద్రంలోని శాంతి నాథ్ దిగంబర జైన్ మందిర్ చేరుకుని గురూజీకి నివాళులర్పించారు. అనంతరం జైన్ మతస్తులు మాట్లాడుతూ..మహారాజ్ జీ 22 వయస్సు లోనే ముని దీక్షా నీ తీసుకున్నారని, వారు దాదాపు 55 సంవత్సరాలు ముని దీక్ష లో ఉంటు జైన మతాన్ని మరియు వాటి నియమాలను చిత్త శుద్ధి తో అనుసరించేవారని తెలిపారు, ఈ కార్యక్రమంలో గార్లలోని జైన్ కుల మత కులస్తులు, చిన్న పెద్ద తేడా లేకుండా మహిళలు కూడా భారీగా పాల్గొన్నారు...

## లీలా మోహన్ జీవితం
# పలువురికి ఆదర్శం

- **25వ వర్ధంతి కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పూనుకొలు నీరజ**

**(ఖమ్మం టౌన్, కెరటం న్యూస్)**
లీలా మోహన్ జీవితం పలువురికి ఆదర్శమని ఖమ్మం నగర మేయర్ పూనుకొలు నీరజ అన్నారు. ఖమ్మం నగరంలోని టేకులపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న అన్నం సేవా ఫౌండేషన్ అనాథ శరణలయంలో దివంగత లీలా మోహన్ 25వ వర్ధంతి కార్యక్రమం సీనియర్ పాత్రికేయులు ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన మేయర్ నీరజ అన్నం ఫౌండేషన్ లో ఉన్న మానసిక వికలాంగులు, అనాథలకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆమె లీలా మోహన్ వర్ధంతిని ఉద్దేశించి మాట్లాడారు. లీల మోహన్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులుగా



ఎనలేని సేవచేశారని మేయర్ తెలిపారు. ఇంజనీర్లు తమ వృత్తి పట్ల నిబద్ధతో పనిచేయాలని తపించేవారని ఆమె గుర్తు చేశారు. ఇంజనీర్లు తమ వృత్తితో పాటుగా సమాజికసేవ దృక్పథం కలిగి ఉండాలని అభిలాషించేవారని అన్నారు. ప్రస్తుత రోజుల్లో చిన్న,చిన్న మనస్పర్థలతో కుటుంబాలే విచ్చినమవుతున్న తరుణంలో,తన చిరకాల మిత్రుడు లీలా మోహన్ వర్ధంతిని గుర్తుపెట్టుకొని జర్నలిస్టులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం హర్షణీయం అన్నారు. తన



స్నేహితున్ని స్మరిస్తూ ప్రతి సంవత్సరం వర్ధంతి వేడుకను నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో బీఈడీ కళాశాల లెక్చరర్ వడపు అరుణ కుమారి,అభిప్రయ్, జిల్లా నాయకులు గుద్దేటి రమేష్ బాబు, రామిశెట్టి విజేత ముత్యాల కోటేశ్వరరావు, చక్రవర్తి, ఉత్కంఠం శ్రీను, పానకాలరావు, జీవన్ రెడ్డి,కొరకొప్పుల రాంబాబు, బిక్కి గోపి,పెరబోయిన తిరుపతి రావు, పులి శ్రీను, వెంకట కృష్ణ, మోత్కురి శ్రీను, మురళి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 10న ఆర్ఎంపిడబ్ల్యూఏ
# జిల్లా మహాసభ

- **హామీల అమలుకై ఉద్యమిస్తాం.....**
- **ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా అద్యాక్షార్యదర్శులు బోమ్మినేని బోయినపల్లి**

**(ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ ప్రతినిధి)**
వచ్చే నెల మార్చి 10వ తేదీన ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా 8వ మహసభ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా అద్యాక్షార్యదర్శులు బోమ్మినేని కొండలరావు బోయినపల్లి శ్రీనివాస్ రావు లు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం పట్టణంలో జిల్లా ముఖ్య నాయకులు మండలాద్యక్షార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిదో జిల్లా మహసభ విజయవంతం కోసం నాయకులు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. ఈమసహభలో గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్ఎంపి లకు ఇచ్చిన వాగ్దానాలు అమలు కోసం భవిష్యత్ కార్యాచరణ నిర్ణయాలు ప్రకటిస్తామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎంపి సంఘాలను ఐక్యం చేసి ఆర్ఎంపి ల సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఎంపిడబ్ల్యూఏ రాష్ట్ర



కమిటీ సభ్యులు బిక్షమయ్య కోటేశ్వరరావు గౌరవ అద్యక్షుడు ఆవుకు వెంకటేశ్వర్లు జిల్లా సహయ కార్యదర్శి ఎస్వీ రామారావు నారాయణ రావు ప్రచార కార్యదర్శి జి రామారావు షేక్ ఖాసీం జలందర్ పెనుబల్లి వేంసూరు బోనకల్ మధిర ఎర్రుపాలెం తిరుమలయాపాలెం రఘునాథపాలెం ఖమ్మం టౌన్ కొణిజర్ల వైరా మండలాద్యక్షార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన
# మహిళల త్రిశూలం దీక్ష



**(ఖమ్మం టౌన్, కెరటం న్యూస్)**
ధర్మో రక్షితః రక్షితః ధర్మాన్ని మనం కాపాడితే అది మనలని కాపాడుతుంది. లోక కళ్యాణం కోసమే రాక్షసవధన జరిగింది . మహా ఋషులు, గురువులు ధర్మం మార్గంలో నడిచారు కాబట్టే ధర్మం రక్షించబడుతుంది . అన్ని శక్తుల కంటే స్త్రీ శక్తి మహా గొప్పది . ముగ్గురు అమ్మలు కలిగినదే శక్తి త్రిశ్యులశక్తి . ఎన్నో జన్మల పుణ్యంమే స్త్రీ జన్మ. అలాంటి స్త్రీ జన్మ లభించడం అంటే స్త్రీలంతా అదృష్టంగా భావించాలి. విశ్వ హిందూ పరిషత్ - బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సీక్వెల్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మహిళ ల త్రిశూల దీక్షకు సుమారుగా 600 మంది దాకా పాల్గొని విజయవంతం చేశారు. 500 సంవత్సరాల తర్వాతకి రామాలయం నిర్మాణంలో రాముడు వచ్చాడు . ఆ తర్వాతకి మన ఇంటికి అక్షింతలు వచ్చాయి . ఇప్పుడు త్రిశూలం మన చేతికి వచ్చింది . మన ఊరు , పల్లె , గ్రామం రామరాజం అయ్యింది . రాముడు చేతిలో ధనుష్ , కృష్ణుని చేతిలో విష్ణు చక్రం , భజరంగ దళ కార్యకర్త చేతిలో త్రిశూలం . రాముడు కృష్ణుడు నడుస్తున్న బాటలోనే మనం నడుస్తున్నాం . ఆయుధం లేకుండా ఎవరు ధర్మాన్ని కాపాడలేరు . కృష్ణుడు ధర్మక్షేత్రంలో కురుక్షేత్రంలో యుద్ధం నడిపించాడు . సాక్షాత్తు రాముడు లంకలో యుద్ధం చేసి రావణాసుని మట్టు పెట్టి వచ్చాడు . ధర్మాన్ని రక్షించడానికి ఆయుధం వాడాలి . ధర్మస్థాపన కోసమే మనందరం త్రిశూల దీక్షను తీసుకున్నాం . మూగ జీవులను హింసించడం , చంపడం మరియు దేవాలయ భూములను ఆక్రమించుకోవడం , ఆడపిల్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటివి మన దృష్టికి వస్తే సహించాల్సిన అవసరం లేదు పోరాడుదాం వాటిని రక్షించుకుందాం . గంగా మాతను కలుష్యం చేస్తున్నారు శుద్ధి చేయాల్సిన అవసరం మనకుంది . సర్వశక్తివమైన పరమేశ్వరుని , శ్రీరాముని , శ్రీ కృష్ణుని , వీర హనుమాన్ ను స్మరించి కుంటూ మన పవిత్ర హిందూ ధర్మాన్ని , సంస్కృతిని , భూ మాతను , గోమాతను రక్షించుకుంటూ నిత్యం కాపాడుకుందాం . ఈ కార్యక్రమంలో బొడ్డు కృష్ణ జిల్లా కార్యదర్శి , బోనాల రామకృష్ణ జిల్లా అద్యక్షులు , నేరెళ్ళ శ్రీనివాస్ జిల్లా కార్యద్యక్షులు , బాలాజి ఖమ్మం విభాగ్ మహిళ కార్యదర్శి నాగమణి , హైమవతి , భవ్య , స్వప్న , ఉమ , పద్మావతి తదితరులు పాల్గొన్నారు .



# టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ చాటిన భరత్ విద్యార్థులు

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**

ఖమ్మం జిల్లా మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో గల శివాలయ ప్రాంగణంలో ఆదివారం ప్రభుత్వ,ప్రైవేటు మాథ్స్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మాథ్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో మధిర పట్టణానికి చెందిన భరత్ విద్యా సంస్థల విద్యార్థులు అనిల్,ఉజ్వల్,అనూష,బిందు,లిఖిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వరుసగా ప్రథమ,ద్వితీయ,తృతీయ,పంచమ,ఆరవ బహుమతులు సాధించారు.ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత శీలం విద్యాలత వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్, ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు,ఉమా,డీన్ రవీందర్ రెడ్డి,స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కృషితోనే జిల్లా రైల్వేస్టేషన్ల అభివృద్ధి

- రేపు పలు అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని
- జిల్లాలోని రైల్వే సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించా: ఎంపీ నామా

**(కెరటం న్యూస్ ఖమ్మం,**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ ఎంపీలుగా పార్లమెంటులో తాము చేసిన కృషి ఫలితంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు రైల్వేస్టేషన్లు అభివృద్ధి చెందాయని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాంతోపాటు ప్రధానిని, రైల్వే మంత్రులను, ఇతర కేంద్రమంత్రులను కలిసి వారితో చర్చించి లేఖలు అందించిన ఫలితంగానే జిల్లాలో పెద్ద ఎత్తున రైల్వేస్టేషన్ల అభి వృద్ధి జరుగుతోందని అన్నారు. అలాగే, కొత్త రైల్వే మార్గాలు, ఆర్వోబీలు, ఆర్యూబీ, అండర్‌పాస్‌లు నిర్మితమయ్యాయని వివరించారు. ఇందులో భాగంగానే జిల్లాలోని ముత్యాలగూడెం, మీనవోలు అండర్‌పాస్ , కొత్తగూడెం రోడ్ ఓవర్ బ్రిడ్జి, డోర్నకల్ పాపటపల్లి రోడ్ అండర్ పాస్, మధిర మోటమర్రి, ఎర్రుపాలెం తొండల గోపవరం రోడ్ అండర్‌పాస్‌లు రూపుదిద్దుకున్నాయని అన్నారు. ఈ క్రమంలో వీటిల్లో పలు అభివృద్ధి పనులను ఈ నెల 26న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించడం గొప్ప విషయమని అన్నారు. జిల్లాలో అమృత్ భారత్ పథకం కింద ఖమ్మం, మధిర, ఎర్రుపాలెం, కొత్తగూడెం, మణుగూరు తదితర రైల్వే స్టేషన్ల పురోభివృద్ధికి బీఆర్ఎస్ ఎంపీగా తాను ఎంతో కృషి చేశానని, ముఖ్యంగా ఖమ్మం రైల్వేస్టేషన్ సర్వతోముఖా భివృ ద్ధికి పాటుపడ్డానని వివరించారు. భద్రాచలం కొవ్వూరు రైల్వే లైన్ కోసం పార్ల మెంట్‌లో మాట్లాడడంతోపాటు 125 లేఖలు రాసినట్లు గుర్తుచేశారు.

## పీఎస్ఆర్ క్రికెట్ టోర్నీ విజేతలకు

# బహుమతుల ప్రదానం

## క్రీడా పోటీలతో స్నేహభావం:తుంబూరు దయాకర్ రెడ్డి



**(ఖమ్మం టౌన్, కెరటం న్యూస్)**

స్థానిక కరుణగిరి సమీపంలోని మైదానంలో రెండు వారాలుగా కొనసాగిన పాలేరు నియోజకవర్గ స్థాయి పీ ఎస్ ఆర్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగియగా..విజేతలకు బహుమతులను రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయం ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ప్రదానం చేశారు. హెూరాహెూరీ గా సాగిన ఫైనల్ మ్యాచ్ లో పెద్ద తండా జట్టు ఈ టోర్నీ విజేతగా నిలిచింది. ద్వితీయ బహుమతిని పీ ఎస్ ఆర్ కరుణగిరి జట్టు దక్కించుకుంది. ఇక మూడో స్థానంలో సాయి నగర్ వికలాంగుల కాలనీ నిలవగా..ఈ జట్ల క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ట్రోఫీ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ సాధించిన వారికి కూడా షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ..తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.ఇలాంటి పోటీల ద్వారా మంచి స్నేహ భావం ఏర్పడుతుందని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కాస్త సమయం క్రీడలకు వెచ్చిస్తే మానసిక ఉల్లాసం తో పాటు క్రీడా స్ఫూర్తి అలవడుతుందని అన్నారు. పీ ఎస్ ఆర్ క్రికెట్ టోర్నీకి మంచి స్పందన వచ్చిందని, ఎక్కువ సంఖ్యలో జట్లు తరలిరావడం హర్షణీయం అని అన్నారు.

**ఏనుగు మహేష్ కు అభినందన..**

ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వాహకులు ఏనుగు మహేష్ ఈ పోటీలను విజయవంతం చేశారని తుంబూరు దయాకర్ రెడ్డి అభినందించారు. మహేష్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని పోటీలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సునీల్ రెడ్డి, చావా శివరామకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు భుజంగ రెడ్డి, బానోతు హరినాయక్, మద్ది వీరారెడ్డి, కొప్పుల చంద్ర శేఖర్, కొర్లకుంట శీనయ్య, మద్ది కిశోర్ రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కొండం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాటాలో మోసం చేస్తున్న దళారీలను పట్టుకుని

# నిర్బంధించిన మారాయిగూడెం గ్రామస్తులు

- క్వింటాకి అదనంగా 25 కేజీలు రిమోట్ ద్వారా మోసం చేస్తున్నట్లు ఒప్పుకున్న మధ్య దళారి మధ్య దళారీని
- వాహనాన్ని నిర్బంధించడంతో రైతులకు గ్రామస్తులకు లక్ష యాభై వేల రూపాయలు నష్టపరిహారం చెల్లింపు



**(కెరటం న్యూస్ ఫిబ్రవరి 25 దుమ్ముగూడెం)**

ఎండుమిర్చి కొనుగోలు చేస్తామని తల్లాడ గ్రామానికి చెందిన కొందరు మధ్య దళారీలు దుమ్ముగూడెం మండలం మారాయి గూడెం గ్రామంలో కి ఆదివారం వచ్చారు ఈ క్రమంలో మిర్చికి కాస్త రేటు ఎక్కువ చెల్లిస్తామని దళారీలు తెలపడంతో ఆశపడ్డ స్థానిక రైతులు మిర్చి అమ్మడానికి ముందుకు వచ్చారు దీంతో దళారులకు రైతులకు రేటు అంగీకారం కావడంతో మారాయి గూడెం గ్రామానికి చెందిన కొందరి వద్ద మిర్చి కొనుగోలు చేసిన దళారీలు సొంది పళ్ళయ్య వద్ద కూడా మధ్య దళారీలు మిర్చి నీ కాటా వేసుకొని మిర్చిని తమతో తెచ్చుకున్న బోలేరా లో లోడు చేసుకుంటున్నారు ఈ క్రమంలో దళారీలు తెచ్చుకున్న కాటాపై రైతులకు అనుమానం కలిగింది దీంతో ఇప్పటివరకు కాటా వేసిన మిర్చి మరోసారి కాటా వేద్దామని మధ్య దళారీని రైతులు అడిగారు రైతులు అడ్డం తిరగడంతో కంగారుపడ్డ మధ్య దళారి ఒకరు అక్కడనుండి పరారీ అయ్యాడు దీంతో రైతులు అనుమానం మరింత బలపడింది ఇద్దరు దళారీలలో ఒకరు పరారీ కాగా మరొకరిని గ్రామస్తులు పట్టుకుని తాళ్లతో కట్టేసి అతను వద్ద తనిఖీ చేయగా కంప్యూటర్ కాటాను నియంత్రించే రిమోట్ ఒకటి లభించింది గ్రామస్తులు రైతులు దొరికిన ఆ మధ్య దళారికి దయాశుద్ధి చేసి కాటాలు ఎంత మోసం చేస్తున్నారని గట్టిగా నిలదీశారు కింటాకు 25 కేజీలు అదనంగా వచ్చేలా రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రిస్తున్నట్లు మధ్య దళారి రైతులకు తెలిపాడు రైతులకు చిక్కిన మధ్య దళారీని పోలీసులు తప్ప చెప్పాలని గ్రామస్తులు ప్రయత్నిస్తుండగా తన తప్పును ఒప్పుకొని మిర్చిని అమ్మిన రైతులకు గ్రామస్తులకు లక్ష యాభై వేల రూపాయలు ముట్టజెప్పి కొనుగోలు చేసిన మిర్చిని సైతం అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు తెలిసింది



# వంగవీడు గ్రామంలో సిసి రోడ్డు శంకుస్థాపన

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**

ఆదివారం వంగవీడు గ్రామంలో స్థానిక శాసనసభ్యులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషి తో మంజూరైన ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్డు పని ప్రారంభించిన మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐలూరి సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు దుంప వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, నిడమానూరు వంశీకృష్ణ, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్, వంగవీటి గ్రామ శాఖ అధ్యక్షులు ఓబుల శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఐలూరి రామకోటమ్మ,మాజీ సర్పంచ్ బండి వెంకటేశ్వర్లు, సముద్రాల పురుషోత్తం , ఓబుల లక్ష్మారెడ్డి త్యాగం సుధాకర్ రెడ్డి, చెరుకూరి సురేష్, వాసిరెడ్డి ప్రదీప్ చౌదరి, ఆదిమూలం శ్రీనివాస్, మైలవరపు చక్రి ,తదితరులు పాల్గొన్నారు



# కల్వర్టును పట్టించుకోండి... మధిరలో స్థానికుల వినతి

**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**

మధిర మున్సిపాలిటీ 20వ వార్డులో కల్వర్టు పగలగొట్టి నెలరోజులు అవుతున్న పట్టించుకోని మున్సిపాలిటీ ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి మరియు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకునే పరిస్థితిలో మున్సిపాలిటీ పాలకవర్గం ప్రజా సమస్యలపై నిమ్మకి నీరు ఎక్కినట్లుగా ప్రజా సమస్యలు గాలికి వదిలేశారు. ఇది ఒక్క సమస్య కాదు 20వ వార్డు నందు కాంట్రాక్టర్ పాలకవర్గం కుంభక్కయి సీసీ రోడ్డు పోశారు కానీ దానికి కలవట్లేదు డ్రైనేజీ వేశారు కలవట్లేదు సైడ్ మరువలేదు మంచినీళ్లు టాప్ కలెక్షన్లు లేవు ఏమిటనే కాంట్రాక్టర్ కి ఫోన్ చేద్దాం అంటే ఫోన్ ఎత్తడు ఏఈ ని అడిగినా మున్సిపల్ చైర్మన్ ని అడిగిన కమిషనర్ను అడిగిన సమాధానం లేదు ప్రజా సమస్యల పరిష్కరించాలని 20 వార్డు ప్రజలు కోరుకుంటున్నారు



# అట్టడుగుకు పాలేరు నీటిమట్టం

**తాగునీటికి మరో పది రోజులకు మాత్రమే జలాలు**

**ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న పంటలు**

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజల డిమాండ్**

**కూసుమంచి, కెరటం**

పాలేరు రిజర్వాయర్‌లో ఎగువ నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో జలాలు నిండుకోవడంతో దిగువన నీటి ఎద్దడి ఏర్పడింది. 10 సంవత్సరాల కింద వచ్చిన సాగునీటి ఇబ్బందులు మరోసారి ఉత్పన్నమయ్యాయి. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 23 అడుగులు కాగా శనివారం నీటి మట్టం 13.5 అడుగుల మేరకు ఉంది. ఇప్పుడు ఉన్న నీటి నిల్వలు మరో 10 రోజుల అవసరాలకు మాత్రమే ఉపయోగపడే అవకాశం ఉంది. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకానికీ జలాలు సరఫరా చేయలేని దుస్థితి. వచ్చేది వేసవి కావడంతో మున్ముందు నీటి అవసరాలు మరింత ఎక్కువగా ఉంటుంది. దీంతో ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల ప్రజలకు తాగునీరు అందే పరిస్థితి లేదు. ఆయా జిల్లాలకు ఒక్కరోజు శుద్ధజలం సరఫరా చేయాలంటే ప్రాజెక్ట్‌లో 126.5 క్యూసెక్కుల నీరు ఉండాలి. కానీ మున్ముందు అన్ని క్యూసెక్కుల నీరు అందడం దుర్లభం. ఇప్పటికే సాగర్ ఆయకట్టులో సాగు చేస్తున్న పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయి. ఎగువ నుంచి ఒకటి రెండు తడులకు నీరు విడుదలైతే తప్ప పంటలు చేతికందలేని దైన్యం. అలాగే జలాశయంలో ఉన్న నీరు ఆవిరయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లేమైనా చేస్తే తప్ప సమస్యకు పరిష్కారం లభించే అవకాశం లేదు. దీనిపై ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులను వివరణ కోరగా.. ప్రభుత్వం ఇప్పటికే నీటి ఎద్దడిపై సమీక్షలు నిర్వహించిందని, ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశపై మరింత స్పష్టత రావాల్సి ఉందని స్పష్టం చేశారు. ప్రజల తాగునీటి కష్టాలు తీరాలంటే రాష్ట్రప్రభుత్వం శ్రీరాంసాగర్ నుంచి జలాలను మళ్లించి పాలేరు జలాశయానికి తీసుకురావాల్సిందే. లేదా కేఆర్ఎంబీ అనుమతులు తీసుకుని సాగర్ నుంచి జలాశయానికి నీరు తీసుకోవాలి. సర్కార్ ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాల్సిందే.

# నిఘా నీడలో ఇంటర్మీడియట్ పరీక్షలు

**డీఐఈవో రవిబాబు**

**ఖమ్మం-కెరటం**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 19వ తేదీ వరకు సీసీ కెమెరాల నిఘాలో పకడ్బందీగా నిర్వహించనున్నట్లు డీఐఈవో(జిల్లా ఇంటర్ విద్యాధికారి) కె. రవిబాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్), డిపార్ట్‌మెంట్ ఆఫీసర్(డీవో)లతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సీఎస్, డీవోలు కీలకమన్నారు. విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించి ఏమైనా లోపాలుంటే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు నడిపేలా, పరీక్షాకేంద్రాల వద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## మల్లు వెంకటేశ్వరరావు దశ దిన

# కర్మకు హాజరైన కాంగ్రెస్ నాయకులు



**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదరుడు మల్లు వెంకటేశ్వరరావు దశాదిన కర్మకు హాజరైన జిల్లా ప్రజా ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొండితోక సుధాకర్ రావు, చెరుకూరి నాగార్జున, పారుపల్లి విజయ్, మండల ఎస్సీ సెల్ దారా బాలరాజ్, 15వార్డు కౌన్సిలర్ కోనా ధని కుమార్ ,ఎర్రగుంట్ల రమేష్, బుల్లెద్దు రాజేంద,ర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు మోదుగు బాబురావు, సిద్ధం శెట్టి సందీప్ తదితరులు కలిసి కీర్తిశేషులు మల్లు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## మెగా మాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో

# దెందుకూరు విద్యార్థుల ప్రభంజనం

**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**




మడుపల్లిలో జరిగిన మెగా టాలెంట్ టెస్ట్‌లో 10 వ తరగతికి చెందిన జడ్పీ హెచ్ ఎస్ దెందుకూరు విద్యార్థులు టాప్ టెన్ లో నాలుగు స్థానాలను కైవసం చేసుకున్నారు.రెండవ ర్యాంక్ తరుణ్ (షీల్డ్, సిల్వర్ మెడల్ మరియు 2000 రూపాయల నగదు బహుమతి) మూడో ర్యాంక్ దోర్నాల భార్గవ్ సందీప్ (షీల్డ్ మరియు వెయ్యి రూపాయలు నగదు బహుమతి) ఏడో ర్యాంక్ ఎస్.కె సమీర్ (షీల్డ్) తొమ్మిదవ ర్యాంక్ ఆర్ నాగబాబు (షీల్డ్) ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన అభినం దన కార్యక్రమంలో మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనబరిచి 100% ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా విద్యాబోధన జరుగుతుందని తెలియజేసినారు మరియు ఉపాధ్యాయినీ- ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ పిల్లలకు మంచి శిక్షణ అందిస్తున్నారని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీ వై ప్రభాకర్ (మధిర మండల విద్యా శాఖ అధికారి), పూర్వ గ్రామ సర్పంచ్ కోట విజయశాంతి , కోపరేటివ్ సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ జడ్.పి.హెచ్.ఎస్ దెందుకూరు పూర్వ విద్యార్థుల సంఘ నిర్వాహకులు అరుణ్ , పాఠశాల పూర్వ చైర్మన్ గోపాల్ రావు, కెవికె యూత్ దెందుకూరు అభినందనలు తెలియజేశారు.

# పీఎంజే జ్యువెలరీ వారి బంపర్ డ్రాలో చిన్నారి పార్థ్వని వరించిన రూ.1.20లక్షల డైమండ్ పెండెంట్

**(ఖమ్మం టౌన్, కెరటం న్యూస్)**



బంగారు ఆభరణాలు వ్యాపారంలో ప్రఖ్యాతిగాంచిన పీఎంజే జువెలరీ ఖమ్మం బ్రాంచ్ ఆదివారం నిర్వహించిన లక్కీ డ్రా లో ఖమ్మం నగరానికి చెందిన చిన్నారి పార్థ్వికి రూ. 1,20,000 విలువైన డైమండ్ పెండెంట్ దక్కిందని సంస్థ నిర్వాహకులు మీడియాకు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..పీఎంజే జ్యువెలర్స్ వారు జనవరి 20వ తారీకు స్టోర్ ఓపెనింగ్ ప్రారంభోత్సవం జరిగింది ఆ రోజు నుండి ఆరు రోజుల వరకు అనగా జనవరి 26వ తారీకు వరకు వచ్చిన ప్రతి కస్టమర్ లక్కీ డ్రా కూపన్లు లో కస్టమర్ల వివరాలు పూరించి డ్రాలో వేయడం జరిగింది సరిగ్గా నెల రోజులు తర్వాత అనగా ఈరోజు 25వ తారీకు ఫిబ్రవరి 2024 సాయంత్రం 6 గంటల సమయంలో లక్కీ డ్రా మొత్తం కస్టమర్ల పరిధిలో వారి స్టోర్లో లక్కీ డ్రా తీయడం జరిగింది ఇందులో ఖమ్మం జయ నగర్ నివాసి అడుసు మల్లి వెంకటేశ్వర్లు సుజాత కుమార్తె చిరంజీవి పార్థ్వి లక్కీ డ్రా విజేతగా గెలుపొందారు. లక్కీ డ్రా లో గెలుచుకున్న వస్తువు సుమారు ఒక లక్ష ఇరవై వేల రూపాయలు విలువ కలిగిన డైమండ్ పెండెంట్ సినీ హీరో మహేష్ బాబు కుమార్తె సితార చేత ఎంపిక చేయబడిన డైమండ్ పెండెంట్ ఉచితంగా ఇవ్వబడిందని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఖమ్మం పట్టణ మహిళలు మరియు పీఎంజే స్టాఫ్ స్టోర్ మేనేజర్ బుగ్గినేని రాజశేఖర్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పట్టణ మహిళ కస్టమర్లు అందరూ హర్షద్వానాలతో శుభాకాంక్షలు తెలియపరిచారు.